# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. పంటల మద్దతు ధరపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.
2. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్‌తో సమావేశమైయ్యారు.
3. ప్రపంచానికి యోగా భారత్ ఇచ్చిన కానుక అని హెూం శాఖ మంత్రి వి. అనిత అన్నారు.
4. కొల్లేరు ప్రాంత పరిరక్షణతో పాటు ప్రజల జీవన స్థితిగతులకు ప్రాధాన్యమిస్తున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.
5. ప్రజా వైద్య రంగంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ తెలిపారు.

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో మామిడి, కోకో, పొగాకు పంటల మద్దతు ధరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలు, ప్రస్తుత పరిస్థితిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. రైతులకు సరైన మద్దతు ధర లభించేలా తీసుకున్న నిర్ణయాలపై అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు.

---------------------------

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఈరోజు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని ఉపరాష్ట్రపతికి తెలియజేశారు. అనంతరం కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో మంత్రి సమావేశంకానున్నారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో

నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి, శ్రీకాకుళం జిల్లాల్లో యోగా కార్యక్రమాలు ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ..

..వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రపంచానికి యోగా భారత్ ఇచ్చిన కానుక అని హోం శాఖ మంత్రి వి. అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని రేవుపోలవరం తీరంలో నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరంలో యోగాంధ్ర నిర్వహించడం హర్షణీయయమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో నిర్వహించడం ఉత్తరాంధ్ర వాసులకి గర్వకారణమని చెప్పారు.

---------------------------

కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన స్థితిగతులకు ప్రాధాన్యమిస్తున్నామని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో నిన్న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేంద్ర సాధికార కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ వారి ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

వాయిస్.. 33 సెకన్లు

---------------------------

అమరావతి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల నివాస భవనాలు, ఏకీకృత సచివాలయల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ఈ రోజు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. త్వరలో 50కి పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం అమరావతిలో పూర్తి అయ్యి ప్రజలకు సేవలు అందించనున్నాయని చెప్పారు.

---------------------------

విశాఖపట్నంలో ఈనెల 21న జరిగే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్‌తో కలిసి ఆయన ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ప్రపంచ రికార్డు సాధించే దిశగా యోగా దినోత్సవ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఐదు లక్షల మంది యోగాలో పాల్గొననున్నారని ఎంపీ తెలుపుతూ,

వాయిస్..20 సెకన్లు

---------------------------

--------------------------

ప్రజా వైద్య రంగంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు మంత్రిగా బాధ్యతల్ని స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా 5 పేజీల నివేదికను ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య రంగంలో అన్ని స్థాయిల్లో సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ వైద్య సేవల్ని మెరుగుపర్చడానికి కృషి చేశామన్నారు. మొదటి ఏడాదిలోనే ఒక వెయ్యి 65 కోట్ల రూపాయల వ్యయంతో గ్రామ స్థాయిలో 3,318 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణానికి అనుమతిని పొందామన్నారు. 10 అత్యవసర కేంద్రాలు, 13 సమీకృత ప్రజారోగ్య ప్రయోగ శాలలు మంజూరయ్యాయని మంత్రి వివరించారు.

--------------------------

వాణిజ్య పన్నులను వసూలు చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాణిజ్య పన్నులు, అనుబంధశాఖల అధికారులతో ఈరోజు జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టబద్ధంగా వాణిజ్య పన్ను వసూలుపై యంత్రాంగం దృష్టి పెట్టాలని చెప్పారు. జిల్లాలో అత్యధికంగా కాటన్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమ,ఆయిల్ మిల్లులు, ఆక్వా రంగానికి సంబంధించిన పరిశ్రమలపై వాణిజ్య పన్నులు అత్యధికంగా వసూలు అవుతున్నాయన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రతి అంశంలోను రాష్ట్ర జీఎస్టీని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

--------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...23 సెకన్లు

--------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దేవీపట్నం మండలం కొండమొదలు అటవీ ప్రాంతంలో ఈ ఉదయం భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. వీరిలో ఇటీవల మృతిచెందిన మావోయిస్టు నాయకులు చలపతిరావు భార్య, స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు అరుణతో పాటు కేంద్ర కమిటీ సభ్యులు, గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అంజుగా గుర్తించామని అధికారులు తెలిపారు.

=====================